వార్డు 86 | అభివృద్ధి చేసిన పార్కులు 7

రావుల చెరువు పార్కు రూ.8 లక్షలు
కల్పించిన వసతులు
ఆట పరికరాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఓపెన్ జిమ్

భరత్‌నగర్ పార్కు నిధులు రూ.16 లక్షలు
కల్పించిన వసతులు
వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లల ఆటపరికరాలు, ప్రహరీ నిర్మాణం

వుడా ఫేజ్–7 పార్కు నిధులు : రూ.8 లక్షలు
కల్పించిన వసతులు
పిల్లల ఆట పరికరాలు, సేద తీరేందుకు సిమెంట్ బెంచీలు

వుడా ఫేజ్–1 అబ్దుల్ కలాం పార్కు నిధులు : రూ.15 లక్షలు
చేపట్టిన పనులు: ప్రహరీ నిర్మాణం

వుడా ఫేజ్–6 గ్రీన్ ల్యాండ్ పార్కు నిధులు : రూ.12 లక్షలు
చేపట్టిన పనులు : ఎల్ షేప్ ప్రహరీ నిర్మాణం, సామాజిక భవనం ఏర్పాటు

రాసాలమ్మ కాలనీ పార్కు నిధులు : రూ.29 లక్షలు
చేపట్టిన పనులు
పార్కు చుట్టూ ప్రహరీ, కాలువ నిర్మాణం

రాజీవ్‌నగర్ డాక్‌యార్డ్ కాలనీ పార్కు నిధులు : రూ.16 లక్షలు
చేపట్టిన పనులు
ప్రహరీ నిర్మాణం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉత్థాన ఏకాదశి



ఎస్టీబీఎల్‌లో విశేష అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: కార్తీక ఏకాదశిని షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కనులపండువగా జరిపించారు. ఉత్థాన ఏకాదశి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వినాయక, వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఉద్యమంతో కేంద్రానికి కనువిప్పు

కూర్మన్నపాలెం: కేంద్రానికి కనువిప్పు కలిగేలా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించి, కార్మిక శక్తి చాటుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 1015వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన ఈఆర్ఎస్, ఈఎస్ అండ్ ఎఫ్ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కులు అమలవ్వాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు పాట్నూరి కన్నబాబు (ఫైల్)

కూర్మన్నపాలెం: చెట్టు కొమ్మలు తెంచేందుకు మామిడి చెట్టు ఎక్కిన వ్యక్తి జారి పడి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన పాట్నూరి కన్నబాబు (52) ఉపాధి కోసం వచ్చి కుటుంబంతో సహా కూర్మన్నపాలెం పరిధి భరత్‌నగర్‌లోని లక్ష్మీగణేష్ ఎన్‌క్లేవ్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం మామిడి కొమ్మల కోసం దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే మార్గంలోని దువ్వాడ పై వంతెన సమీపంలో ఉన్న చెట్టు ఎక్కి మామిడి కొమ్మలు కోస్తుండగా పట్టు తప్పి కిందపడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 వాహనంలో కేజీహెచ్ తరలిస్తుండగా మార్గంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'విభజన హామీలపై మాట్లాడండి'

డాబాగార్డెన్స్: రాజకీయ పార్టీలు విభజన హామీలపై మాట్లాడాలని ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధులు ప్రొఫెసర్ అప్పలనాయుడు, చలసాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు కూడా ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విమర్శలే తప్పా..విభజన హామీలపై మాట్లాడడం లేదన్నారు. ఈ సమయంలో కూడా రాష్ట్రం కోసం పట్టించుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం





వుడా ఫేజ్–7 పార్కులో పిల్లల ఆట పరికరాలు

సిటీ లైఫ్ అంటేనే బిజీ బిజీ.. ఆ గజిబిజి గందరగోళం నుంచి బయటపడి, సాయంత్రం వేళ ప్రకృతి ఒడిలో, ప్రశాంత వాతావరణంలో సేద తీరాలనుకునే వారిని నందనవనాన్ని తలపిస్తున్న పార్కులు స్వాగతిస్తున్నాయి. పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన చిన్నారులను ఆహ్వానిస్తూ ఎన్నో ఆటపరికరాలు ఏర్పాటయ్యాయి. ఆహ్లాదకర వాతావరణంలో నడిచివద్దాం అనుకునే వారి కోసం వాకింగ్ ట్రాక్‌లు సిద్ధమయ్యాయి. యువతకు ఆరోగ్యాన్ని పెంపొందించే ఓపెన్ జిమ్‌లు కూడా పార్కులోనే నెలకొల్పారు. ఇలా.. అందం.. ఆహ్లాదం .. ఆరోగ్యం ఒకేచోట, అదీ ఇంటికి సమీపంలోనే సిద్ధమై, ఆహ్వానం పలుకుతున్నాయి.



కూర్మన్నపాలెం: మహా విశాఖ నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ సుందరీకరణకు జీవీఎంసీ విశేష కృషి చేస్తోంది. నగర ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. పెరుగుతున్న వాహన, పరిశ్రమల కాలుష్యం వల్ల వాతావరణంలో పెనుమార్పులు సంభవించి ఉష్ణోగ్రతల హెచ్చు తగ్గుల మూలంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిని తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించేందుకు జీవీఎంసీ పార్కుల సుందరీకరణకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 86వ వార్డు కూర్మన్నపాలెం పరిధిలోని 7 ప్రాంతాల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేయడంతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



రాజీవ్‌నగర్ డాక్‌యార్డ్ కాలనీలో పార్కు చుట్టూ నిర్మించిన ప్రహరీ



భరత్‌నగర్ పార్కులో ఆట పరికరాలు

పెరుగుతున్న సందర్శకులు

పార్కులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు అందమైన పూలమొక్కలు ఏర్పాటు చేయడంతో పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రక్షణగా ప్రహరీ నిర్మాణంతో పాటు ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా బల్లలు, వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయడంతో ప్రజలు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వెళ్లి ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పొందుతున్నారు. పార్కుల్లో సౌకర్యాలు కల్పించడంతో సందర్శకులు పెరిగారు.



భరత్‌నగర్ పార్కులో వాకింగ్ ట్రాక్



రావుల చెరువు వాకర్స్ పార్కులో పిల్లల ఆట పరికరాలు



భరత్‌నగర్ పార్కులో నిర్మించిన ప్రహరీ గోడ

ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్



ఆరోగ్యరీత్యా వాకింగ్ చేయాలన్న డాక్టర్ సలహాతో స్థానికంగా ఉన్న పార్కుకు వెళ్తున్నాను. గతంలో పార్కులో నడవాలంటేనే భయమేసేది. ఇప్పుడు పార్కులను బాగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్‌ను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పార్కులో మొక్కలను పెంచుతున్నారు. పచ్చదనం చూస్తూ ఉల్లాసంగా వాకింగ్ చేయడంతో ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం.

– వెంకటశాస్త్రి, వుడా ఫేజ్–6

ప్రభుత్వ చొరవతోనే అభివృద్ధి సాధ్యమైంది



గతంలో పార్కులు సరిగ్గా లేకపోవడంతో, అభివృద్ధి చేయాలని అధికారులకు తరచూ వినతిపత్రాలు ఇచ్చేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పార్కులను బాగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా ప్రహరీగోడ, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట పరికరాలు వంటివి ఎంతో ఉపయోగకరం.

– సీహెచ్.పాండురంగారావు, కూర్మన్నపాలెం

పార్కులకు జీవం పోశారు



గతంలో నిత్యం కాలుష్యంతో సతమతమవుతూ పచ్చదనం కోసం ఎదురుచూస్తూ ఉండేవాళ్లం. ప్రశాంతతకు, సహజ వాతావరణానికి దూరమయ్యాం అని బాధ పడేవాళ్లం. పిల్లలు కూడా బయట ఆడుకునే వీల్లేక ఇంట్లోనే ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు పార్కులు చాలా బాగున్నాయి. పార్కుల్లో ఆటపరికరాలు ఉండటంతో పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ ఉల్లాసంగా గడుపుతున్నాం.

– సేరీ బేగమ్, కూర్మన్నపాలెం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

76వ వార్డులో రూ.1.87 కోట్లతో చేపట్టనున్న పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 76వ వార్డులోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 76వ వార్డు పరిధిలో ఒక కోటి 87 లక్షల 10వేల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఈ వార్డులో 75శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన 25 శాతం పనులు కూడా చకచకా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, ప్రమీల, నర్సింహమూర్తి, కాకినాడ పెంటారావు, భవానీ, చిక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శ్రీకారం : జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని ఫైర్ స్టేషన్ నుంచి వాటర్ ట్యాంక్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఏపీఐఐసీ ప్రతినిధులు గురువారం శంకుస్థాపన చేశారు.

శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండప ప్రవేశం చేసిన కాపు సంఘం నాయకులు

గాజువాక : శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాతకర్ణవానిపాలెంలో నిర్మించిన నూతన ఏసీ కల్యాణ మండపాన్ని ఆ సంఘం నాయకులు గురువారం ప్రారంభించారు. కల్యాణ మండపం అడ్‌హక్ కమిటీ చైర్మన్ గుడివాడ అమ్మన్న, నిర్మాణ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం దంపతుల పూజ అనంతరం నాయకులు మండప ప్రవేశం చేశారు. 71వ వార్డు కార్పొరేటర్, కేటీబీ దక్షిణ విభాగం అధ్యక్షుడు రాజాన రామారావు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా సౌత్ విభాగంలో కాపు, తెలగ, తూర్పు కాపు, బలిజ సంఘ నాయకులంతా బాధ్యత తీసుకోవడంతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయగలిగామన్నారు. దీంతో రెండు దశాబ్దాల కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుడివాడ అప్పలరామ్మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ విందుల రమణ, ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి తాటికొండ జగదీష్, నాయకులు కరణం కనకారావు, కర్రి నాగేశ్వరరావు, గంధం వెంకటరావు, దుల్ల రామునాయుడు, నీరుకొండ రామచంద్రరావు, రాంబాబు, పృథ్విరాజ్, కాశి, ఇందల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సర్వతోముఖాభివృద్ధి



భానోజీతోటలో సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



87వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

- జగనన్నే మళ్లీ ముఖ్యమంతి కావాలన్నది ప్రజల ఆకాంక్ష
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 65, 87 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 65వ వార్డు భానోజీతోటలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందని, దీనికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రం మరింత ప్రగతి సాధించేలా, ఈ సుపరిపాలన కొనసాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, మద్దాల అప్పారావు, లోకనాథం, మంగునాయుడు, ఇరోతి గణేష్, జుత్తు లక్ష్మి, దేముడు, రాంబాబు, రమణ, పుష్ప, సాజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

సీఎం జగన్ పాలన సువర్ణాధ్యాయం

కూర్మన్నపాలెం: దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుపరిచారన్నారు. 87వ వార్డు వడ్లపూడి సచివాలయం–1 పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండాను ఎగురవేసి, గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ఎందరో ప్రజలు లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, వంద్రాసి సన్యాసిరావు, దుగ్గపు దానప్పలు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఆదారి శ్రీను, బొండా గోవిందరాజులు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంత్యుత్సవాలు



గుడివాడ అప్పన్నకాలనీలోని సత్యసాయి మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఉక్కు సత్యసాయి మందిరంలో పేద యువతికి కుట్టుమిషన్ అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు



అగనంపూడి ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: సత్యసాయి బాబా 98వ జయంతిని 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో గల సత్యసాయి మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు సత్యసాయి బాబా వ్రతాలు నిర్వహించారు. మింది–గుడివాడ అప్పన్నకాలనీ సత్యసాయి బాబా భజన మండలి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారుసాయంత్రం ప్రదర్శించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సత్యసాయి భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: సత్యసాయిబాబా జయంతి వేడుకలు గురువారం ఉక్కునగరంలో వైభవంగా జరిగాయి. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేకువజామున ఓంకారం, నగర సంకీర్తన , సుప్రభాతం నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణం, రుద్రాభిషేకాల అనంతరం వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. విశ్వశాంతి, మానవ కళ్యాణం కోసం సాయి గాయత్రి యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. రేణుకా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యసాయి దివ్య వ్రతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశపాత్రునిపాలెంకు చెందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. కేక్ కటింగ్, ఉయ్యాల ఉత్సవ్‌లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

అగనంపూడి: భగవాన్ సత్యసాయి జయంతిని పురస్కరించుకుని అగనంపూడి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎన్.ఎస్.రావు మాట్లాడుతూ సత్యసాయి మార్గంలో ఆయన భక్తులు నడుస్తూ సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, డాక్టర్ ఉష, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు బి.వి.సుబ్బారావు, రామన్, గిరిధర్, బి.శ్రీనివాసరావు, కె.జయ, అప్పలనర్సమ్మ, వివిధ ప్రజా, సేవా సంఘాల ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, విందుల నారాయణరావు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో అణగారిన వర్గాలకు తీవ్ర నష్టం



సదస్సును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు, అతిథులు

ఉక్కునగరం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల అణగారిన వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పార్లమెంట్ మాజీ సభ్యుడు మిడియం బాబూరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో 'ప్రభుత్వ రంగం – రిజర్వేషన్లు' అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. ప్రభుత్వ రంగం వల్ల దేశంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు నష్టం చేసేందుకే కంకణం కట్టుకుందని ఆరోపించారు. వక్తలు వెంకటేశ్వర్లు, కె.వినయకుమార్, ఎ.దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. కొంతమంది ప్రైవేటు పెట్టుబడిదారులకు ప్లాంట్‌ను కట్టబెట్టి ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయాలని కంకణం కట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో ఆయా అసోసియేషన్ల నాయకులు బయ్యే మల్లయ్య, బి.తౌడన్న, బి.అప్పారావు, వివిధ కార్మిక సంఘాల నాయకుల కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ గౌరవ సలహాదారుడిగా త్రినాథరావు



కల్పలతా రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా అల్లూరి జిల్లా అరుకు ఎంఈవో–1 వంతల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ రెడ్డి, కార్యదర్శి సుధీర్ నియామకాన్ని ప్రకటించారు. గెజిటెడ్ అధికారి హోదా గల వంతల త్రినాథరావు సేవలను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకుంటామని వైఎస్సార్ టీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కలసి సంఘం బలోపేతంపై తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.